గ్రామీణ రహదారులు అధ్వానం

- ఊళ్లలో రోడ్లు గుంతలమయం
- చినుకు పడితే చిత్తడే
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- నడిచేందుకు వీలులేని దుస్థితి
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం




కోసిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట గుంతలో నిలిచిన వర్షపు నీరు, బురదమయమైన రోడ్డుపై అవస్థలు పడుతున్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు

కోసిగి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి దూరమయ్యిందని ప్రజల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా గ్రామాల్లోకి వెళ్లేందుకు కనీస రోడ్డు వసతి లేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్లు గుంతమయం కావడంతో పాటు చిన్నపాటి వర్షానికే బురదమయం అవుతుండటంతో అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు, కూటమి నాయకులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేరోడ్లును పట్టించుకుని మరమ్మతులు చేసి గ్రామాలకు సురక్షితంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.

ప్రభుత్వ కార్యాలయాల ఎదుటే..

మండలంలో ప్రధానంగా మేజర్ పంచాయతీ కోసిగిలో పంచాయతీ కార్యాలయం ఎదుట, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డు గుంతల మయంగా మారింది. చినుకు పడితే చాలు గుంతలు నిండా వర్షపు నీటితో నిండి పోయి వాహనాలు, పాదచారులు నడిచి వెళ్లేందుకు వీలులేకుండా తయారైంది. పలు వాహనదారులు గుంతలలో అదుపు తప్పి ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. అధికారులు చూసిచూడనట్టు వెళ్లిపోతుండడంతో గమనార్హం.

- కోసిగి ఏపీ మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు మట్టి రోడ్డు గుంతలుగా మారిపోయింది. వర్షం కురిస్తే విద్యార్థులు నడిచి వెళ్లేందుకు, సైకిళ్ల పై వెళ్లుందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అదుపు తప్పితే బురద గుంతలో పడిపోవాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మండల పరిధిలోని దుద్ది గ్రామంలో నడి ఊళ్లలో బస్టాండ్ నుంచి సచివాలయం వరకు గుంతల మయంగా మారింది. వర్షపు నీటితో పాటు గ్రామంలోని మురుగు నీరు కూడా ప్రధాన రోడ్డు పైకి వచ్చి చేరుతోంది. ఎళ్లవేళల ఆ గ్రామంలో రోడ్డుపై దుర్గంతభరితంగా ఉండటంతో గ్రామ ప్రజలు నరకం చవిచూస్తున్నారు. గ్రామం మీదుగా చిర్తనకల్లు, అగసనూరు, సాతనూరు, తుంగభద్ర, తుంబిగనూరు గ్రామాలకు రాకపోకలు కొనసాగుతున్నాయి. దుర్గంభరితంగా ఉన్న రోడ్డు పై వాహనదాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- మండలంలోని సాగనూరు నుంచి అగసనూరు గ్రామం మీదుగా ఆర్డీఎస్ ఆనకట్ట ప్రధాన రోడ్డు వరకు దాదాపు 4.5కిలో మీటర్ల మేర తారు రోడ్డు గుంతలు పడి కంకర తేలింది. రోడ్డు పక్కనే వరి మళ్లు ఉండడంతో సైడ్లలో గుంతలు పడ్డాయి. ఇటీవల ట్రాక్టర్లు, బస్సులు సైతం గుంతలో ఇరుక్కుపోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.
- మూగలదొడ్డి క్రాస్ రోడ్డు నుంచి గ్రామంలోకి 3.45కిలోమీటర్లు ఉంది. ఆ రోడ్డు బీటీ రోడ్డు నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం రూ.1.35కోట్లు బడ్జెట్ కేటయించింది. జూన్ నెలలో రోడ్డు నిర్మిస్తామంటూ కూటమి నేతలు భూమి పూజ చేసి వదిలేశారు. ఇంత వరకు



కూటమి నాయకులు భూమిపూజ చేసి వదిలేసిన మూగలదొడ్డి రోడ్డు

పనులు ప్రారంభానికి నోచుకోలేదు. రోడ్డు వేస్తారా లేదో, కేవలం ఆర్భాటం చేశారా? అంటూ ఆగ్రామ ప్రజలు సందిగ్ధంలో పడిపోయారు. గుంతల పడిన రోడ్డులో వెళ్లలేక గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు.

క్లుప్తంగా

అన్నదానానికి రూ.50వేలు విరాళం



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదానానికి మంగళవారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. బెంగళూరు వాస్తవ్యులైన ప్రగతి, ఖ్యాతి, కుంటుంబ సభ్యులు రూ.50,000వేలను నగదు రూపంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణికి అందజేశారు.

నిరాశ్రయులను ఆదుకోవాలి

ఆదోని టౌన్: పట్టణంలోని రెండోవార్డు బావాజీపేటలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరడంతో ఇళ్లు పడిపోయి నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలని వార్డు కౌన్సిలర్ సురేష్ సంబంధిత అధికారులను కోరారు. మంగళవారం ఆయన వార్డులో పర్యటించారు.

లోకకల్యాణార్థం ఇష్టలింగ పూజ

ఆదోని అర్బన్: వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మంగళవారం అల్కూరుమఠంలో మహర్షి విజయ్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పీఠాధిపతులు పాల్తూరుమఠం చెన్నవీర శివాచార్యులు, పురవర్గమఠం జంగమమరహొసహళ్లి ఆజాతశంభులింగ శివాచార్యులు, హిరేమఠం రవళకుండ శివయోగ శివాచార్యులతో ఇష్టలింగ పూజ కార్యక్రమం నిర్వహించారు. .

పరామర్శ



రాజేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో డీలర్ రామలింగప్ప తమ్ముడు రాజేష్(40) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంటరీ స్టేట్ సెక్రటరీ ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి గ్రామానికి వెళ్లి రాజేష్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎర్రకోట కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు..

గ్రామాలకు యూరియా సరఫరా

సాక్షి ఎఫెక్ట్

కోసిగి: మండలంలో వివిధ గ్రామాలకు యూరియా అందక పోవడంతో రైతులు పడుతున్న కష్టాలపై ఈనెల 11వ తేదీన 'కూటమి పాలన రైతుల కష్టాలు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారి వరప్రసాద్ స్పందించారు. జిల్లా ఉన్నత అధికారులతో మాట్లాడి మండలంలోని రైతులకు ప్రస్తుతం 26 మెట్రిక్ టన్నులు యూరియా తెప్పించినట్లు తెలిపారు. వచ్చిన యూరియాను మండలంలోని సజ్జలగుడ్డం, దేవరబెట్ట, యండపల్లి, నేలకోసిగి, వందగల్లు గ్రామాల రైతులకు సరఫరా చేశారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

పెద్దకడబూరు : ప్యాచ్‌వర్క్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు ఖాజ, కృష్ణ డిమాండ్ చేశారు. ఆదోని డీఈ పద్మనాభరెడ్డికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. రోడ్డు మరమ్మతులకు రూ. 16లక్షలు వెచ్చిస్తే కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా పనులు చేపట్టాడన్నారు.

కూలిన మట్టిమిద్దె

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని నాయీబ్రహ్మణ కాలనీలో మంగళవారం ఉదయం మంగలి శారదమ్మకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. మండలంలో గత నాలుగు రోజులుగా తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో శారదమ్మ మట్టిమిద్దె వర్షానికి మెత్తబడి కూలింది. శారదమ్మ, కూతురు ఇద్దరు ఇంట్లో వస్తువులను సర్దుకుంటుండగా ఇంటిపై కప్పు నుంచి పెళ్లమని శబ్దం రావడంతో బయటకు పరుగులు తీశారు. దీంతో వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇంట్లో ఉన్న సామాన్లు, బియ్యం ఇతరత్రా సామాగ్రి మొత్తం మట్టిలో కూరుకుపోయాయి. ప్రభుత్వం స్పందించి బాధితురాలికి ఇల్లు మంజూరు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయే అవకాశం వుందని ఏపీ ఆటో,ట్రాలీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కోల్పోయే ఆటో కార్మికులకు నెలకు రూ.12వేల చొప్పున ప్రభుత్వం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు రాముడు, ఆటో వర్కర్స్ యునియన్ నాయకులు షబ్బీర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈరన్నస్వామి సన్నిధిలో ఎస్పీ



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను సత్కరిస్తున్న డీసీ వాణి, అర్చకులు

కౌతాళం: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుందలో ఈరన్నస్వామిని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఈఓ వాణి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి పూలమాల, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రావణమాసం ఉత్సవ ఏర్పాట్లపై ఈఓ వాణిని అడిగి తెలుసుకున్నారు.

పోలీస్టేషన్ తనిఖీ

స్వామి దర్శనం అనంతరం ఎస్పీ కౌతాళంలోని పోలీస్టేషన్‌ను తనిఖీ చేశారు. మండలంలో పోలీసింగ్ వ్యవస్థను పటిష్టపరచాలని స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా భరోసా కల్పించాలన్నారు. పోలీస్టేషన్ పరిసరాలను తిరిగి పరిశీలించారు. ఇతని వెంట సీఐ అశోక్‌కుమార్ ఉన్నారు.

పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్..

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను, పెండింగ్ కేసులను, రికార్డుల గదిని, ఫిర్యాదుల విభాగాన్ని, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ పోలీసులకు సూచించారు.

ఇస్వీ పోలీస్‌స్టేషన్..

పట్టణంలోని ఇస్వీ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని డీఎస్పీ హేమలత, తాలూకా సీఐ నల్లప్ప, ఎస్ఐ డాక్టర్ నాయక్‌లకు సూచించారు.

ఆరోగ్యకరమైన జీవనశైలితోనే నులిపురుగుల నిర్మూలన



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా నులిపురుగులను పూర్తిగా నిర్మూలించవచ్చని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సబ్‌కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రంగనాథరావు, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ రఘురాంరెడ్డి, మెడికల్ ఆఫీసర్ షాహినాజ్‌బేగం, మున్సిపల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సందీప్, డీపీఎంఓ సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పెద్దకడబూరు : స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాల, ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో వైద్యాధికారి డాక్టర్ కేజియా ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

నందవరం : మండలంలో 8,834 మంది విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలను అందించినట్లు డాక్టర్ రేవతి వివరించారు.

గోనెగండ్ల : నులిపురుగు నివారణతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్రవైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామనాథ్, జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. స్థానిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని పరిశీలించారు.

కోసిగి: స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థినులకు డాక్టర్ రాజకిరీటి, స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మీన్, కందుకూరు పాఠశాలలో డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

కుంగిన రోడ్డు పరిశీలన

ఆదోని రూరల్: ఆదోని బైపాస్ రోడ్డులో కుంగిపోయిన రోడ్డును మంగళవారం సీపీఎం బృందం పరిశీలించింది. పార్టీ జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు, సీపీఎం పట్టణ మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న మాట్లాడుతూ ఆలూరు రోడ్డు నుంచి పత్తికొండ రోడ్డు వరకు నిర్మాణం జరుగుతున్న ఆదోని బైపాస్ రోడ్డు జగనన్న కాలనీకి వెళ్లే దారిలో నాణ్యత సరిగా లేక మొత్తం కుంగిపోయిందన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

ఆదోని టౌన్: అభివృద్ధికి సహకరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ కోరారు. మంగళవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో కుడా ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించడం ద్వారా మాత్రమే ప్రణాళికబద్ధమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మౌలిక వసతులను మెరుగుపరచడం, అక్రమ నిర్మాణాలను అరికట్టడం, పచ్చదనం పెంపు వంటి అంశాల్లో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీఎల్‌పీఓ తిమ్మక్క, ప్లానింగ్ ఆఫీసర్‌లు విజయభాస్కర్, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తర్వులు రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులు విద్యార్థుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని వెంటనే వాటిని రద్దు చేయాని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, జిల్లా కార్యదర్శి సోమశేఖర్, పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాలు డిమాండ్ చేశారు. స్థానిక భగత్ సింగ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల ఆవరణలోకి అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఎమ్మిగనూరుటౌన్/నందవరం/మంత్రాలయం రూరల్/గోనెగండ్ల/కోసిగి: ఏఐఎస్ఎఫ్ 90ఏఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మిగనూరు బాలుర హైస్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు విజయేంద్ర, సమీవుల్లా జెండావిష్కరణ చేశారు. నందవరంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, మంత్రాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్, గోనెగండ్లలో ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి, కోసిగిలో సంఘం మాజీ సీనియర్ నాయకులు నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంత్రాలయం రూరల్ : మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన అశోక్, తుంగభద్ర గ్రామానికి చెందిన తెలుగు రాజశేఖర్ గాయపడ్డారు. ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన అశోక్ మాధవరం వైపుగా హోండా షైన్ బైకు వెళ్తుండగా తుంగభద్ర వైపు నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తున్న రాజశేఖర్ ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో అశోక్ తీవ్రంగా పడగా రాజశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో ఎమ్మిగనూరుకు తీసుకెళ్లారు. అశోక్ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి రథోత్సవం



రాఘవేంద్రుని రథోత్సవం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. గత మూడు రోజులుగా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్వామి వారి రథాన్ని గ్రామ పురవీధుల గుండా తిప్పారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయ ఆవరణలో నుంచి ప్రారంభమైన దివ్వరథోత్సవం ముందు వివిధ ప్రాంతాలకు చెందిన భజనమండలి సభ్యులు, భక్తి పాటలతో, భజనలతో సాగారు. మహిళల కోలాటాలు అందరిని అలరించాయి. కార్యక్రమాలు గురుజగన్నాథ దాససేవ సమితి నిర్వాహకులు అప్పన్నచారి హనుమంతరావు స్వాముల ఆధ్వర్యంలో జరిగాయి.

ముగిసిన ఆరాధనోత్సవాలు

ఆదోని అర్బన్: మంత్రాలయం మఠం శ్రీ గురురాఘవేంద్రస్వామి 354వ ఆరాధన మహోత్సవాలు మూడో రోజు మంగళవారంతో ముగిశాయి. పట్టణ శివారులో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనోత్సవాలు ఆలయ మేనేజర్ భీమసేన ఆచారి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఘనంగా జరిగాయి. ఆలయ పూజారులు గురురాజ ఆచార్, అక్షయ్‌కుమార్ మంగరాయ ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు, రాఘవేంద్రస్వామి, ప్రహ్లాదస్వాముల విగ్రహాలకు అభిషేకాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట



క్యూఆర్ కోడ్ పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

కౌతాళం: సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు మోసం చేయడంలో దిట్ట అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఎంపీపీ అమరేష్ అన్నారు. మంగళవారం కాత్రికి, లింగాలదిన్నె, అగసలదిన్నె, డంబలదిన్నె, బాపురం గ్రామాల్లో నాయకులు నాగభూషణ్‌గౌడ్, సర్పంచ్ వీరభద్రగౌడ్, నారాయణ, గురునాథ్‌రెడ్డి, జైపాల్‌ల ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరిగి క్యూఆర్ కోడ్‌తో బాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకాంబర్‌రెడ్డి, సర్పంచ్‌లు మహేశ్, గోపాల్‌రెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, అబ్దుల్‌సమద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలంలో రూ. 3.20 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్

ఎమ్మిగనూరురూరల్: ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం కర్నూలు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలాల్లో ప్రభుత్వానికి రూ. 3.20 లక్షలు ఆదాయం సమకూరింది. ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణ కేసుల్లో పట్టుబడిన 25 వాహనాలకు వేలాలు నిర్వహించగా మూడు వాహనాలు మినహా 22 వాహనాలను పాటదారులు తమ సొంతం చేసుకున్నారని చెప్పారు. మోటార్ వెహికిల్ అధికారులు వాహనాలకు రూ. 1,92,500 విలువ నిర్ణయించగా పోటీదారుల ద్వారా రూ. 2,71,500 లు ఆదాయం వచ్చిందని తెలిపారు. జీఎస్టీతో కలసి మొత్తం రూ. 3,20,370లు వచ్చిందన్నారు. ఆర్టీవో నిర్ణయించిన ధర కంటే 41.04 శాతం పెరుగుదల వచ్చిందని తెలిపారు. వేలాల్లో ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి, ఎస్ఐలు ఇస్మాయిల్, ఎన్. రాయుడు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ స్కూల్ బస్సు

- విద్యార్థులకు తప్పిన ప్రమాదం



రోడ్డుపై వేచివున్న విద్యార్థులు

గోనెగండ్ల: ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో విద్యార్థులకు ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.వివరాల్లోకి వెళితే.. గోనెగండ్లలోని ఎమ్మిగనూరు రోడ్డులో జీనియస్ గ్లోబల్ స్కూల్ ఉంది. ఈ పాఠశాల బస్సు రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం గంజిహళ్లి గ్రామానికి వెళ్లి విద్యార్థులను ఎక్కించుకుంది. తిరిగి వచ్చే సమయంలో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఒక్కసారిగా పిల్లలు గట్టిగా కేకలు వేయడంతో గ్రామస్తులు హుటాహుటిన బస్సు దగ్గరకు వెళ్లి విద్యార్థులను కిందకు దింపారు. బస్సులో దాదాపు 50 మంది విద్యార్థులు ఉన్నారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. కండీషన్ లేని బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోవడంతోనే ఈ ఘటన జరిగిందని, ఇందుకు కారణమైన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

సంతకొచ్చి.. ప్రాణాలు కోల్పోయి !



మృతి చెందిన అంబమ్మ

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన ఉప్పలపాటి అంబమ్మ(55) అనే మహిళ కోసిగి సంతకొచ్చి హఠాన్మరణం పొందారు. ఈమె వారానికోసారి ఇంటికి సరిపడే కిరాణ సరుకులు, కూరగాయలు, తదితరవి కొనుగోలు చేసుకొని వెళ్తుంది. మంగళవారం మధ్యాహ్నం సంతకొచ్చిన అంబమ్మ సరుకులు తీసుకుని తిరిగి వెళ్లే క్రమంలో వైఎస్సార్ సర్కిల్‌లో హఠాతుగా కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. గమనించిన స్థానికులు ఆమెను కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతిరాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లి ఆకస్మిక మరణంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.

స్థలాన్ని వెనక్కి తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: విజయవాడలోని గవర్నర్ పేటలో ఏపీఎస్ఆర్‌టీసీలోని రెండవ డిపో 2కు చెందిన సుమారు రూ.400ల కోట్ల విలువైన 4.15 ఎకరాల భూమిని లూలూ మార్ట్‌కు లీజుకు అప్పగించే జీఓను వెంటనే రద్దు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సహాయకార్యదర్శి మదార్ సాహెబ్, డిపో కార్యదర్శి ముస్తాక్ అహమ్మద్, కేఎం సాహెబ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సిబ్బందికి పదోన్నతుల్లేవన్నారు. వెంటనే ఆ ప్రక్రియను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సురేష్‌బాబు, శ్రీనివాసులు, ఎంవీ మహేష్, బషీర్, డీఎస్ఎస్ వలి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

ఆదోని టౌన్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక డిపో ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేశారు. డిపో అధ్యక్షుడు ఎల్.బసవరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, డిపో కార్యదర్శి రామలింగప్ప, గ్యారేజీ అధ్యక్షులు ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

గోనెగండ్ల: పత్తి పంటలో గులాబీ రంగు పురుగును నివారించడానికి రైతులు లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాఘవేంద్ర, ఏఓ హేమలత సూచించారు. మంగళవారం మండలంలోని కులుమాల గ్రామంలో పత్తి రైతులకు గులాబీ రంగు పురుగు నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌డీసీ కంపెనీ ప్రతినిధి ఉపేంద్ర రెడ్డి, కారుణ్య సంస్థ ప్రతినిధి మధుసూదన్ రావు, వ్యవసాయ విస్తరణ అధికారి పులిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

ఆదోని రూరల్: ఎయిడ్స్ నియంత్రణకు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆర్డిప్ ప్రాజెక్టు మేనేజర్ మాలిక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో, ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ జగదీష్, సిబ్బంది యల్లప్ప, ఆర్డిప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: సుఖవ్యాధులు,హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగివుండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ సంస్థ ప్రతినిధి రామాంజినేయులు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సుఖవ్యాధులపై అవగాహన కల్పించారు.